# ఇండెగ్రేషన్

సినిమా హాల్లోంచి బయటకు వచ్చి టైమ్ చూసుకున్నాడు నాగశంకర్రావు. పదీ పదయింది. మూడు తరాల సెంటిమెంటల్ కుటుంబగాథను ముఖం ముడతలు పడ్డ హీరోల చుట్టూ మూడున్నర గంటలు తిప్పి మొహం వాచేలా బోరు కొట్టే మహత్తర శక్తి మన తెలుగు సినిమాలకే ఉందన్న నిజాన్ని మళ్ళీ యింకోసారి గ్రహించి గబగబా బస్‌స్టాపు వేపు నడిచాడు.

చివరి బస్సు కోసం నుంచున్న ఓ అయిదారుగురు తప్ప బస్ స్టాప్ లో యింకెవరూ లేరు. నాగశంకర్రావు కూడా వెళ్ళి స్టాప్ లో నుంచున్నాడు. అక్కడక్కడా మునిసిపాలిటీవారి దీపాలు వెలుగుతున్నాయి. ఆ చీకటిలోనే జీవం ఉన్న ఓ ప్రాణి - అంటే డొక్కలు ఎండిపోయి సన్నగా, పీలగా చింపిరి జుట్టుతో, మొలకో చింకి గుడ్డ తప్ప వేరే బట్టల్లేకుండా, చలికి వణుకుతున్న ఓ అయిదేళ్ళ పిల్ల అతని దగ్గరకు వచ్చింది. అప్పుడే చూచాడు నాగశంకర్రావ్. అది ఒక ప్రాణి కాదు - రెండు ప్రాణులు అని. ఆ పిల్ల భుజం మీద ఒక నెలల పిల్లవాడు నీరసంగా కళ్ళు మూసుకొని పడుకున్నాడు. ఆ పసి పిల్లాడు చచ్చాడో, బ్రతికే వున్నాడో

చెప్పటం కష్టం. వాడిది శరీరం అనటానికి వీలులేదు. మాంసం లేని ఎముకల గూడు అనాలేము. అంత రాత్రివేళ ఆ పిల్ల, ఆ అబ్బాయిని కుడి భుజం మీద వేసుకున్న ఎడం చేత్తో డొక్కల మీద కొట్టుకుంటూ ఆకలిని సూచిస్తూ, కళ్ళతో ఏదన్నా యిమ్మని అర్థించింది. నాగశంకర్రావు హృదయం చలికి వణుకుతూ బాధగా మూలిగింది. మన దేశంలో ఈ దారిద్ర్యం ఎప్పటికి తీరేటట్టు? అసలు అంత గర్భ దరిద్రం అనుభవిస్తూ,యింకా పిల్లల్ని కనే ఆ తల్లిదండ్రులు ఎంత అనాగరికులో, ఎంత అజ్ఞానులో దేశ ప్రగతి దృష్ట్యా ఎంత ద్రోహులో అంచనా వేస్తూ అలానే నుంచున్నాడు.

ఉరుములు, మెరుపులూ లేకుండా సన్నగా వాన ప్రారంభమయింది.

ఇతను ఏమీ యివ్వడని నిర్ధారణ చేసుకున్న ఆ పిల్ల నీరసంగా ఆ బస్ షెల్టర్ క్రింద, పసిపిల్లాడిని ఆ కటిక నేల మీద పడుకోబెట్టి తనూ వాడి ప్రక్కనే పడుకుంది.. కొంచెం సేపటికి వానలో తడస్తూ, యింకో మూడున్నర ఏళ్ళ పిల్లాడు వచ్చాడు. ఆ పిల్ల దగ్గర కూర్చుని, చేతిలోని మూట విప్పాడు. ఆ పిల్ల లేచి కూర్చుంది.

రెండేళ్ళ పిల్లని వెంటబెట్టుకుని, గడ్డం పెరిగి ఎంతో చీదరగా వున్న ఒక కుంటివాడు వచ్చి, వాళ్ళ దగ్గరే కూర్చున్నాడు. వాడి చేతిలో మూట వున్నది. కానీ మూటలో ఏమీ లేదు.

ఇంతలో ఒక ఆడమనిషి పరుగెత్తుతున్నంత వేగంగా వచ్చింది. ఆమె కట్టుకున్న బట్టలు(!) ఎండిపోయిన ఆమె వక్షాల్ని కానీ, మిగతా శరీర భాగాల్ని కానీ పూర్తిగా దాచలేకపోతున్నాయి. ఆమె కూర్చుని, తన చేతిలోని కాగితం పొట్లం విప్పింది.

వాళ్ళను చూచిన నాగశంకర్రావ్‌కు ఏదో కుతూహలం లాంటిది కలిగింది. తను అనుకున్న అనాగరకుల్ని - ఎక్కువ మంది పిల్లల్ని కన్న అజ్ఞానుల్నీ, దేశ ప్రగతి దృష్ట్యా ద్రోహుల్నీ, చూస్తూ అలాగే నుంచున్నాడు.

కుంటివాడూ, వాడి పెళ్లాం, అయిదేళ్ళ పిల్ల, మూడున్నర ఏళ్ళ పిల్లవాడు, రెండేళ్ళ పిల్ల వరసగా కూర్చుని వాళ్ళు సంపాదించిన 'తిండి' ని తినటానికి ఉపక్రమించారు. మొత్తం అయిదుగురూ తిరిగినా సంపాదించింది యిద్దరే..రెండు మూటల్లోని 'మాదాకబళాన్ని' కలిపి అయిదు భాగాలు చేసింది వాడి పెళ్ళాం. ముగ్గురు పిల్లలకీ మూడు భాగాలు యిచ్చింది. తన భర్తకో భాగాన్నిచ్చి, తనోటి తీసుకుంది.

బయట వాన బాగా పడుతున్నది. మీద పడుతున్న జల్లును లెఖ్ఖచేయకుండా, అందరూ ఆత్రంగా తింటున్నారు. నెలల పసివాడు కేరు కేరుమని ఏడుస్తున్నాడు. వాడిని ఒళ్ళోవేసుకుని, ఆమె అన్నం ముద్దలు నోట్లో కూరుకుంటున్నది. పసివాడు ఎండిపోయిన ఆమె వక్షంలో పాల కోసం వెదుకుతున్నాడు.

ఆ సమిష్టి జీవన సరళిని చూస్తూ నుంచున్న నాగశంకర్రావ్ బస్సు ఆగటం చూసి ఉలిక్కిపడ్డాడు.

బస్‌లో ఎక్కాడు. బస్ బయల్దేరింది. ✿